kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

గురువారం
19-03-2026 పేజీలు: 2

360° SINGLE TOPIC

బడ్జెట్ - ఆశలు

# ఈ బడ్జెట్‌లోనైనా హామీ దక్కేనా?



పింఛన్ల పెంపు కోసం వృద్ధులు.. ఆర్థిక సాయం కోసం మహిళల ఎదురుచూపులు

జాబ్ క్యాలెండర్‌పై స్పష్టత కోసం నిరుద్యోగుల నిరీక్షణ

మేనిఫెస్టోలోని మిగిలిన హామీలకు బడ్జెట్ మోక్షం చూపేనా?

బడ్జెట్ ప్రవేశపెట్టే ప్రతిసారీ ప్రజల్లో ఒక ఆసక్తి నెలకొంటుంది. అది కేంద్ర బడ్జెట్ అయినా.. రాష్ట్ర బడ్జెట్ అయినా. ప్రభుత్వాలు వరాలు ప్రకటిస్తాయేమోనన్న ఆశలే ఇందుకు కారణం.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన ఫస్ట్ బడ్జెట్‌లో సంక్షేమంపై ఫోకస్ పెట్టింది. ఫస్ట్ ఇయర్‌లోనే రైతులకు సంపూర్ణ రుణమాఫీ సహా పలు గ్యారంటీలు అమల్లోకి వచ్చాయి. గత బడ్జెట్‌లో మాత్రం కొత్త స్కీమ్‌లేవీ ప్రకటించలేదు. అందుకే ఈసారి బడ్జెట్‌లో కొత్త పథకాల కోసం ఎదురుచూపులు.

మహిళలకు రెండున్నర వేల ఆర్థిక సాయం, వృద్ధాప్య పింఛన్ల పెంపు, విద్యార్థినులకు స్కూటీలు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, కొత్త పీఆర్సీ ఫిట్‌మెంట్, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం.. ఇలాంటివేమైనా బడ్జెట్‌లో ఉంటాయేమోనన్న ఆశ.

ఒకవైపు ప్రతిపక్షాల విమర్శలు, మరోవైపు మేనిఫెస్టోలోని హామీల అమలు, ప్రభుత్వంపై ప్రజల నమ్మకం.. వీటి నేపథ్యంలో సీఎం నిర్ణయం, డిప్యూటీ సీఎం ప్రకటనపై ఉత్కంఠ నెలకొన్నది.

శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్ టేబుల్ కానున్న నేపథ్యంలో అమలుకాని హామీలు.. జనం ఎదురుచూపులపై కలం 360 డిగ్రీస్ స్పెషల్...

తెలంగాణ బ్యూరో, కలం







## మిగిలినవి రెండు ఫుల్ బడ్జెట్‌లే!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటుతున్నది. ఈ టర్మ్‌లో ఇంకా మిగిలినవి రెండు ఫుల్ బడ్జెట్‌లే. అందులో శుక్రవారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై జనంలో భారీ ఆశలు ఉన్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏవి ఈ బడ్జెట్‌లో ప్రస్తావనకు వస్తాయోనని అంతా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరిన రెండో రోజు నుంచే 'మహిళలకు ఫ్రీ జర్నీ' తో మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయడం ప్రారంభించింది. రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఫ్రీ విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం.. ఇలా పలు స్కీమ్‌లను సక్సెస్‌ఫుల్‌గా రన్ చేస్తున్నది. ఇంకా పలు హామీలు మిగిలే ఉన్నాయి. వస్తున్న ఆదాయంలో గత ప్రభుత్వ అప్పులకు కిస్తీలు చెల్లిస్తూ, ఉద్యోగులకు టైమ్‌కు జీతాలు ఇస్తూ.. మిగిలినవాటిని సంక్షేమానికి ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్తున్నారు. తప్పకుండా హామీలన్నీ అమలు చేస్తామంటున్నారు.



## పింఛన్ డబుల్ అయ్యేనా?

చేయూత పథకం కింద వృద్ధులకు పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని తెలిపింది. ప్రభుత్వం ప్రస్తుతానికి పాత పింఛన్లనే చెల్లిస్తున్నది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులు, చేనేత, గీత, బీడీ కార్మికులకు రూ.2,016 చొప్పున ఇస్తున్నది. దివ్యాంగులకు రూ.4,016 అందజేస్తున్నది.

- ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పింఛన్లను పెంచాలని ప్రభుత్వం కొంతకాలంగా కసరత్తు చేస్తున్నది. ఒకేసారి కాకుండా విడతల వారీగా పెంపు అమలు చేయాలని, మొదట రూ.500 పెంచాలని భావిస్తున్నది. ఈ నెల 20న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో పెన్షన్ల పెంపుకు సంబంధించి నిధుల కేటాయింపు ఉండే అవకాశం ఉందని చర్చ జరుగుతున్నది.
- 2024 సామాజిక సర్వే లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 42.7 లక్షల మందికి పెన్షన్ అందుతున్నది. ఇందుకు ప్రతి నెల రూ.950 కోట్లు ఖర్చవుతున్నది. ఈ లెక్కన పెన్షన్ రూ.500 పెంచితే నెలకు సుమారు రూ.210 కోట్లు, ఏడాదికి రూ.2,500 కోట్లకు పైగా ప్రభుత్వం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.



## ప్రతీ మహిళకు రూ.2,500



మహాలక్ష్మి స్కీమ్ కింద మహిళలకు ప్రతీ నెల రూ.2,500 ఆర్థిక సాయం అందజేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇదే స్కీమ్‌లో భాగంగా ఇప్పటికే ఫ్రీ జర్నీ, రూ. 500కే గ్యాస్ సిలిండర్‌ను అమలు చేస్తున్నది. ఆర్థిక సాయంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనిపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తూనే ఉన్నాయి. టైమ్ వచ్చినప్పుడు తప్పకుండా ఇస్తామని, ఇప్పటికే తెలంగాణ మహిళల సాధికారతకు ఫస్ట్ ప్రయారిటీ ఇస్తున్నామని అధికార పార్టీ నేతలు చెప్తున్నారు.



## యువతులకు స్కూటీలు

18 సంవత్సరాలు పైబడి, చదువుకునే ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్లను అందజేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) వేడుకల్లో ఈ హామీని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. త్వరలోనే కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు అందజేస్తామని ఆయన అన్నారు.

## తులం బంగారం



గతంలో ఉన్న కల్యాణలక్ష్మి స్థానంలో కల్యాణమస్తు స్కీమ్ తెస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దీని కింద పేదింటి యువతుల వివాహానికి రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు ఇందిరమ్మ కానుకగా తులం (10 గ్రాములు) బంగారం ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సాయం మాత్రమే అందజేస్తున్నది. తులం బంగారం హామీ ఇంకా అమల్లోకి రాలేదు. ఇప్పుడు బంగారం ధరలు బాగా పెరిగిపోయాయి. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం బంగారమే ఇస్తుందా? లేదంటే ప్రత్యామ్నాయంగా ఆర్థిక సాయం పెంచుతుందా? దీనికి ఈ బడ్జెట్‌లో ఏమైనా హామీ దొరుకుతుందా?!



## అమరుల కుటుంబాలకు సాయం

తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో ప్రాణాలర్పించిన యువతీ యువకులను ఉద్యమ అమరవీరులుగా గుర్తిస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పేర్కొంది. అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు తల్లి/తండ్రి/భార్యకు ప్రతినెల రూ.25 వేలు అమరవీరుల గౌరవ పెన్షన్ అందజేస్తామని హామీ ఇచ్చింది. 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని తెలిపింది. ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను ఎత్తివేయడంతో పాటు జూన్ 2న వాళ్లకు తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇస్తామని ప్రకటించింది. అయితే.. అమరవీరుల కుటుంబాలకు త్వరలోనే నెలకు రూ.25 వేల పింఛన్, 250 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్టు 2024 జులైలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. దీనిపై చాలాసార్లు ప్రకటనలు చేసినప్పటికీ కార్యాచరణ మొదలుకాలేదు.



## నిరుద్యోగ భృతి.. జాబ్ క్యాలెండర్..




నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేంత వరకు ప్రతి నెల రూ.4 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ చెప్పింది. దీనిపై ఇంకా ఎలాంటి ప్రకటన రాలేదు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ కూడా ఇదే హామీ ఇచ్చినప్పటికీ తిరిగి అధికారంలోకి వచ్చాక పక్కనపెట్టింది.

- ప్రతి ఏటా జూన్ 2 నాటికి అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, సెప్టెంబర్ 17లోపు నియామకాలు పూర్తి చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. 2024 ఆగస్టు 2న అసెంబ్లీలో తొలి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించింది. 2025లో జాబ్ క్యాలెండర్ రాలేదు. 2026 జాబ్ క్యాలెండర్ త్వరలోనే విడుదల చేస్తామని మంత్రులు పలు సందర్భాల్లో పేర్కొన్నారు.



## విద్యా జ్యోతులు స్కీమ్

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు విద్యా జ్యోతులు పథకం తెస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ తెలిపింది. ఎస్సీ, ఎస్టీ స్టూడెంట్లు పదో తరగతి పాసైతే రూ.10 వేలు, ఇంటర్ పాసైతే రూ.15 వేలు, డిగ్రీ పూర్తి చేస్తే రూ.25 వేలు, పీజీ పూర్తి చేస్తే రూ.లక్ష అందజేస్తామని ప్రకటించింది. ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేస్తే రూ.5 లక్షలు అందజేస్తామని తెలిపింది. ప్రభుత్వం దీనిపై ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ బడ్జెట్ లోనైనా ఏమైనా నిధుల కేటాయింపు దక్కుతుందా? అనేది ఆసక్తికరం.



# గిగ్ వర్కర్లకు చట్టం వచ్చేనా?




గిగ్ వర్కర్ల ఆర్థిక, ఆరోగ్య భద్రత కోసం చట్టం తెస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక ఆ మేరకు కసరత్తు చేపట్టింది. గతేడాది చివర్లో కేబినెట్ కూడా దీనికి ఆమోదం తెలిపింది. ఈ బడ్జెట్ సమావేశాల్లో చట్టానికి ఆమోదం లభిస్తుందా? అని గిగ్ వర్కర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఫుడ్, గ్రాసరీ డెలివరీ ప్లాట్‌ఫామ్స్‌తో పాటు ట్రాన్స్‌పోర్ట్ ప్లాట్‌ఫామ్స్‌లో కలిపి దాదాపు 3.5 లక్షల మంది పని చేస్తున్నారు. వీరిలో ఎక్కువగా హైదరాబాద్‌లోనే ఉన్నారు. వీళ్లకు ఎలాంటి ఆరోగ్య, ఉపాధి భద్రత లేదు. చట్టం అమల్లోకి వస్తే వీరిని ప్రత్యేక శ్రామిక వర్గంగా గుర్తించి.. అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తారు.



## ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు

ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందజేస్తామని, వాళ్ల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించింది. ఇవి ఇంకా అమల్లోకి రాలేదు.

- ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీ కల్పించడంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై కొంతమేర ప్రభావం పడింది.
- తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ ఆటో డ్రైవర్లు ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో సమ్మె, ఫిబ్రవరిలో చలో సెక్రటేరియెట్ కార్యక్రమాలు చేపట్టారు.

## ఆర్టీసీ విలీనం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను పూర్తి చేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించింది. ఆర్టీసీలో యూనియన్ల పునరుద్ధరణకు అనుమతిస్తామని తెలిపింది.

- ఆర్టీసీ విలీన ప్రక్రియ ప్రభుత్వ పరిశీలనలో ఉందని 2024 ఫిబ్రవరిలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కానీ అది ఇంకా పూర్తి కాలేదు.
- ఆర్టీసీ విలీనం, ఇతర సమస్యల పరిష్కారం కోసం కార్మికులు గత కొన్ని రోజులుగా పోరాటం చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24న చలో సెక్రటేరియెట్ కార్యక్రమం చేపట్టారు. ఇటీవల సమ్మె నోటీస్ ఇచ్చారు.

